
సూర్యచంద్రులపై గోవిందుడి విహారం

సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తున్న శ్రీగోవిందరాజస్వామి



కళాకారుల కోలాట భజన

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు బుధవారం రాత్రి చంద్రప్రభ వాహనంపై దర్బార్ కృష్ణుడి అలంకారంలో శ్రీగోవిందరాజస్వామి అభయమిచ్చారు. కళాబృందాల ప్రదర్శనల మధ్య, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి చంద్రప్రభ వాహన సేవ కోలాహలంగా సాగింది. దీనికి ముందు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి సూర్యప్రభ వాహన సేవ అత్యంత వేడుకంగా నిర్వహించారు. భక్తజన బృందాలు చెక్కల భజనలు, కోలాటా లు, మంగళవాయిద్యాల నడుమ సూర్యప్రభ వాహనధారుడై గోవిందుడు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీభూ సమేత శ్రీగోవిందరాజస్వా మి వారికి స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, చందనంతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, సూపరింటెండెంట్ మోహన్ రావు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు శ్రీగోవిందరాజస్వామి రథోత్సవం

శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో గురువారం స్వామివారి రథోత్సవం వైభవంగా జరుగనుంది. ఉదయం 6.35 గంటల నుంచి రథంపై అధిరోహించిన స్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి 7 గంటలకు అశ్వ వాహనంపై స్వామివారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

క్లుప్తంగా

రామాంజులరెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి అర్బన్ మండలం మంగళం సప్తగిరినగర్ గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్, ఉపసర్పంచ్ వసంతు అశోక్‌రెడ్డి తండ్రి వసంతు రామాంజులరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో సప్తగిరినగర్ గ్రామ పంచాయతీలోని అశోక్‌రెడ్డి నివాసం వద్ద బుధవారం నిర్వహించిన రామాంజులరెడ్డి కర్మక్రియల్లో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొని రామాంజులరెడ్డి చిత్రపటానికి పుష్పగుచ్ఛంతో నివాళులర్పించారు. అనంతరం ఉపసర్పంచ్ అశోక్ రెడ్డిని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పరామర్శించి, కుటుంబ సభ్యులకు తనప్రగాఢసానుభూతిని తెలియజేశారు.

బాధ్యతల స్వీకరణ



రామారావు, విశ్వనాథ్ చౌదరి, వెంకటాద్రి

తిరుపతి క్రైమ్: తిరుపతిలో పలువురు పోలీసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా వెంకటాద్రి, స్పెషల్ బ్రాంచ్ సీఐగా విశ్వనాథ్ చౌదరి, అలిపిరి సీఐగా రామారావు బాధ్యతలు స్వీకరించారు. రెండు రోజుల క్రితం వీరిని ఈసీ నియమించింది.

నరసింహస్వామి ఆవిర్భావ దినోత్సవం



శంఖాభిషేకం చేస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఇస్కాన్ మందిరంలో బుధవారం సాయంత్రం నరసింహ చతుర్దశి, నరసింహస్వామి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం మంగళ హారతి, ప్రత్యేక దర్శన హారతి, గురుపూజ నిర్వహించారు. శ్రీమద్ భాగవతం ప్రవచనం చేపట్టారు. తర్వాత శ్రీసుదర్శన, నరసింహ యజ్ఞం, మహా శంఖాభిషేకం చేశారు. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతి రమణ దాస్ శ్రీనరసింహ స్వామి లీలపై ప్రత్యేక ప్రవచనం చేశారు.

ఆలస్యం.. విశ్వరూపం



అమ్మవారిపై సూర్య కిరణాలు పడకుండా తెరను అడ్డుగా పెట్టిన నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతర నిర్వాహకుల నిర్లక్ష్యంతో అత్యంత ముఖ్యమైన అమ్మవారి విశ్వరూపం చెంప తొలగింపు ఘట్టం ఆలస్యంగా సాగింది. జాతరలో ఈ ఘట్టం సూర్యోదయానికంటే ముందే పూర్తి చేయడం ఆనవాయితీ. అయితే ఆలయ అధికారులు, జాతర మిరాశీదారుల మధ్య సమన్వయ లోపంతో బుధవారం ఉదయం అమ్మవారి విశ్వరూపం చెంపతొలగింపు ఘట్టం ఆలస్యంగా చేపట్టారు. ఉదయం సూర్యుని కిరణాలు అమ్మవారి విశ్వరూపంపై పడకుండా తెరను అడ్డుగా పెట్టాల్సి వచ్చింది. అయితే అమ్మవారిని తిలకించేందుకు రాత్రంతా ఆలయం వద్ద వేచివున్న భక్తులు తీవ్ర నిరాశకు గురై, పెద్దగా కేకలు వేశారు. అయితే మిరాశీదారుల కటుంబ సభ్యులు అక్కడ ఉండకూడదని ఆలయ ఈవో మమత పోలీసుల ద్వారా బయటకు నెట్టివేసేందుకు ప్రయత్నించారు. దీంతో విశ్వరూప మిరాశీదారులు, ఈవో మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఆలయ పాలక మండలి జోక్యంతో సద్దుమణిగింది.

ఘనంగా షష్టిపూర్తి మహోత్సవం



ముమ్మారెడ్డి దంపతులకు షష్టిపూర్తి నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

తిరుపతి కల్చరల్: తిరుచానూరు సమీపంలోని రాహుల్ ఫంక్షన్ హాల్లో బుధవారం రాత్రి ముమ్మారెడ్డి క్రిష్టారెడ్డి, రుక్మిణమ్మ దంపతుల షష్టిపూర్తి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. 60 ఏళ్లు పూర్తి చేసుకొని 61వ ఏట అడుగిడుతున్న ఈ అన్యోన్య దంపతులకు కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. క్రిష్టారెడ్డి, రుక్మిణమ్మ దంపతులను కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వారికుమారులు, కోడళ్లు, కుమార్తెలు, అల్లుళ్లు, మనవలు, మనవరాళ్లు పాల్గొన్నారు.

ఆత్మహత్య కాదు .. ముమ్మాటికీ హత్యే!



ధర్నాకు దిగిన తలారిపల్లె గ్రామస్తులు

పాకాల: తన కొడుకును హత్య చేసి, రైలు పట్టాలపై పడేసి ఆత్మహత్యగా ఏమార్చే ప్రయత్నం చేశారని మృతుడి తల్లి సి.పార్వతి ఆరోపించారు. బాధితురాలి కథనం మేరకు, పాకాల మండలం, ఇరంగారిపల్లె పంచాయితీ తలారి పల్లెకు చెందిన చింతమాగుల మురళి, పాకాలలోని పకీర్ పేటకు చెందిన బాలిక ప్రేమించుకున్నారు. నాలుగు రోజుల క్రితం వీరిద్దరూ ఇంట్లో నుంచి పరారయ్యారు. అమ్మాయి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు బెంగళూరులో ఉన్న మురళి, బాలికను రప్పించారు. ఇద్దరినీ మందలించి బాలికను, మురళిని వారి తల్లిదండ్రులకు శనివారం రాత్రి అప్పగించారు. మురళికి సంబంధించిన మొబైల్ ఫోన్ బాలిక మేనమామ కర్ణ తీసుకున్నాడు. దీంతో ఆదివారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు మొబైల్ ఫోన్ తీసుకొచ్చి మురళికి అప్పగించాలని పోలీసులు తెలిపారు. ఆదివారం మొబైల్ కోసం మురళి ఒక్కడే పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి రాలేదని బంధువుల ఇళ్ల వద్ద కుటుంబసభ్యులు వెతుకుతున్నారు. అయితే ఆదివారం రాత్రి పాకాల సమీపంలో రైలు పట్టాలపై మృతదేహం పడి ఉందని పత్రికల్లో వార్తలు వచ్చాయి. మూడు రోజులుగా మురళి కనిపించకపోవడంతో అనుమానం వచ్చి పోలీసుల వద్దకు వెళ్లారు. మృతదేహం ఫోటోలు తెప్పించిన పోలీసులు కుటుంబ సభ్యులకు చూపించారు. శరీరంపై కత్తిపోటు గాయాలు ఉండడాన్ని గుర్తించిన తలారి పల్లె గ్రామస్తులు పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం ధర్నాకు దిగారు. ఫకీర్ పేటకు చెందిన బాలిక కుటుంబ సభ్యులు మురళిని హత్య చేసి పట్టాలపై పడేశారంటూ ఆరోపించారు. వెంటనే వారిని అరెస్టు చేసి విచారించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పాకాల పోలీసులు కేసు నమోదు చేసి విచారణ మొదలుపెట్టారు.

జీవ వైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న అధికారులు

తిరుపతి మంగళం : ప్రతి విద్యార్థి జీవవైవిధ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని జూక్యూరేటర్ సెల్వం సూచించారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల (ఎస్వీ జూపార్క్)లో బుధవారం ఏపీ బయోడైవర్శిటీ బోర్డు (గుంటూరు) వారి ఆధ్వర్యంలో ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవాన్ని నిర్వహించారు. విశ్వం హైస్కూల్ విద్యార్థులతో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులకు జీవవైవిధ్యంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులు అడవుల పరిరక్షణ, జంతు సంరక్షణపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వోలు యశోదబాయ్, జి.సతీష్, శివకుమార్, ధర్మరాజులు, ఏసీఎఫ్ నాగభూషణం, రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు కో-ఆర్డినేటర్ ఖాదర్‌వల్లి, విద్యార్థులు పాల్గొన్నారు.

కోలాహలం.. అర్జున తపస్సు



తపస్మాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం యడమవారిపల్లె 73వ మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం అర్జున తపస్సు కోలాహలంగా సాగింది. ఈ మహాఘట్టాన్ని మహాభారతం ప్రాంగణంలో పెద్ద మానును నాటి ఆ మానుకు 18 మెట్లు చెక్కి వాటిని అర్జున వేషధారుడు పైకి ఎక్కుతూ ప్రతి మెట్టుకు పద్యం పాడుతూ దేవున్ని ప్రార్థిస్తూ తపస్సుమాను పైకి ఎక్కి అక్కడి నుంచి పూలు, నిమ్మకాయలు, అరటిపండ్లు, విబూది పండ్లు చల్లాడు. పండ్లు, పూలు, కాయల కోసం ఎగబడి పట్టుకున్నారు. వాటిని భుజిస్తే మనస్సులో కోరుకున్న కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ తపస్సు కార్యక్రమానికి వచ్చి భక్తులు కోరిన కొర్కెలు నెరవేరడంతో మొక్కులు చెల్లించుకోవడం జరిగింది.

జనార్దన్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ జాగ్రఫీ విభాగం పరిశోధక విద్యార్థి తూపల్లి జనార్దన్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ప్రొఫెసర్ వై సుజాత పర్యవేక్షణలో ఎ స్టడీ ఆఫ్ స్లమ్స్ ఇన్ ది మున్సిపల్ టౌన్స్ ఆఫ్ చిత్తూరు డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్ ఎ సోషియో ఎకనమిక్ సర్వే అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు.

నేటి నుంచి అన్నమయ్య జయంతి ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల వారి 616వ జయంతి ఉత్సవాలు ఈనెల 23వ తేదీ గురువారం నుంచి 29వ తేదీ వరకు అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాకలోని ధ్యానమందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద, తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో జరుగనున్నాయి.

రుయాకు ఏసీల వితరణ

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆసుపత్రి ఔషధ విభాగానికి దాతలు 2 ఏసీ (ఎయిర్ కండిషనర్)లను బుధవారం వితరణగా అందజేశారు. మెడికల్ కళాశాల పీజీ వైద్య విద్యార్థులు వీటిని అందచేశారు. డాక్టర్ సురేంద్ర కుమార్, డాక్టర్ మీనాక్షి, డాక్టర్ అమృత కిరణ్ కుమార్, డాక్టర్ రామమూర్తి, డాక్టర్ రాధా తదితరులు పాల్గొన్నారు.